ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

కార్యక్రమాలు ప్రారంభించిన ప్రోటెమ్ స్పీకర్ భర్తహరి
కొత్త పార్లమెంట్ భవనంలో సభ్యుల ప్రమాణం
తొలుత ప్రమాణం చేసిన ప్రధాని మోదీ
తదుపరి మంత్రులు రాజ్‌నాథ్,అమిత్ షా, గడ్కరీ, శివరాజ్ ప్రమాణాలు
రాహుల్ వయనాడ్‌కు రాజీనామాను స్పీకర్ ఆమోదించినట్లు ప్రకటన

2లో..

సంపుటి: 2 | సంచిక: 75 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 25 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో

# సీఎం రేవంత్ భేటీ

రక్షణ భూముల బదలాయింపులపై చర్చ
ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సహకరించాలి
వరంగల్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు వినతి
మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ భేటీ



న్యూఢిల్లీ, జూన్ 24 (ప్రభాత ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఆ పర్యటనలో భాగంగా ఆయన వివిధ కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రంలో జరగాల్సిన అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను సీఎం కలిసి.. వారికి పలు విజ్ఞప్తులను చేస్తున్నారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను సోమవారం సాయంత్రం కలిశారు. అలాగే మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలసి పలు అంశాలపై వినతిపత్రం అందచేశారు. హైదరాబాద్ నగరంలో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యల గురించి రేవంత్ రెడ్డి రాజ్ నాథ్ సింగ్ వద్ద ప్రస్తావించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో అన్ని భూములు రక్షణ శాఖ పరిధిలో ఉండడంతో అక్కడి రోడ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోతోందని చెప్పారు. రక్షణ భూముల విషయంలో కేంద్రం ఆలోచించాలని వివరించారు. అలాగే, వరంగల్ లో ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటు సహా ఇతర అంశాలను కూడా రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం కూడా ఇచ్చారు. హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్

..మిగతా 2లో



పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

### ఉపాధ్యాయులు రావడం లేదని

## విద్యార్థుల ఆందోళన

ఓబులోనిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆవేదన

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24 (ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా.. ఉపాధ్యాయులు లేక బోధన సక్రమంగా సాగడం లేదని సోమవారం ధరూర్ మండలం ఓబులోనిపల్లి గ్రామం మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. వివరాలకు వెళ్లితే... గద్వాల జిల్లా ధరూర్ మండలం ఓబులోనిపల్లి మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 100మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యస్తున్నారు. 100 మంది విద్యార్థులకు హెచ్ఎం తో పాటు మరో ఉపాధ్యాయుడు ఉన్నాడు. కొన్ని నెలలుగా హెచ్ఎం లీవ్ లోకి వెళ్లడంతో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడితో గత విద్యా సంవత్సరం విద్యార్థుల చదువులు అంతంతే ముందుకు సాగినాయి. గతంలోనే ఉపాధ్యాయుల సమస్యలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పరిష్కారం కాలేదు. ఫలితంగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై పదిరోజుకు కావొస్తున్న ఒక ఉపాధ్యాయుడితోనే పాఠాలు బోధిస్తున్నారు. ఆ ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోతే తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు బడులు మానేసి పత్తి చేనులో పనికి వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలని వారు కోరుతున్నారు.

## విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను సిద్ధం చేయండి



### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

శ్రీశైలం, జూన్ 24 (ప్రభాత ఉదయం): శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్లను త్వరితగతిన సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హైడల్ ప్రాజెక్టును ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ, మాజీ సీఎంజీ హెచ్ అశోక్ కుమార్, హైడల్ డెరెక్టర్ వెంకట్‌రాజన్, సీఎంజీ హెచ్ఆర్ అజయ్‌తో కలిసి విద్యుత్ కేంద్రం సర్వీస్ బేలో పర్యటించారు. నాలుగో యూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులు అర్పించారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోపభూయిష్టమైన సాంకేతికతో రాష్ట్ర ప్రయోజనాలకు వచ్చే నష్టాన్ని వివరించి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి సీఈవో వరకు ఒకే కుటుంబంలా సమష్టి కృషి చేసి త్వరితగతిన నాల్గో యూనిట్‌ను

..మిగతా 2లో

## రైల్‌రోకో కేసు కొట్టేయండి: కెసిఆర్



హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు 2011లో రైల్‌రోకో సందర్భంగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిందని తప్పుడు కేసు అని, తాను రైల్‌రోకోలో పాల్గొనలేదని కోర్టుకు వివరించారు. రైల్ రోకో కేసులో తనను 15వ నిందితుడుగా చేర్చారని పేర్కొన్నారు. కాగా కేసీఆర్ పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరగనుంది.

### అలకబూనిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ

## జీవన్ రెడ్డి

పార్టీలో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై కినుక
కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తాడన్న ప్రచారం
తొందరపాటు నిర్ణయం వద్దని ఆది శ్రీనివాస్ బుజ్జగింపు
బిజెపిలో చేరుతాడంటూ ప్రచారం



జగిత్యాల, జూన్ 24 (ప్రభాత ఉదయం): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిక ఆ పార్టీలో చిచ్చురేపింది. ఎమ్మెల్సీ పదవికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. ఈ విషయంపై తన అనుచరులు, పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తనకు తెలియచేయకుండా సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంపై మండిపడ్డారు. భారాసకు చెందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తనకు సమాచారం లేకుండా ఆయన్ను పార్టీలో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఆయన తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గంలో 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్, జీవన్‌రెడ్డి ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నికల్లోనూ వీరిద్దరే పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం

..మిగతా 2లో



### ప్రోటెం స్పీకర్ ఎంపికలో

## నిబంధనలు బేఖాతర్

పార్లమెంట్ ముందు ఇండియా కూటమి సభ్యుల నిరసన

న్యూఢిల్లీ, జూన్ 24 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీలు నిరసకు దిగారు . పార్లమెంట్ పాతభవనం నుంచి కొత్త భవనం వరకు ర్యాలీ తీశారు. ప్రొటెం స్పీకర్ ఎంపిక విషయంలో రూల్స్ పాటించలేదంటూ అభ్యంతరం తెలిపారు. రాజ్యాంగం కాపీలను చేతుల పట్టుకుని గాంధీ విగ్రహం దగ్గర కాసేపు నిరసన చేపట్టారు. సోనియా గాంధీ,రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. మోదీ రాజ్యాంగానికి విలువ ఇవ్వడం లేదంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా మోదీ పాలన సాగిస్తున్నారంటూ ÷ర్ అయ్యారు. అనంతరం రాహుల్ సహా కూటమి సభ్యులు లోక్ సభలోకి వెళ్లారు. మోదీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించారని..అందుకే ఇవాళ అన్ని పార్టీల నేతలు ఏకమై నిరసనలు తెలుపుతున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ రాజ్యాంగం ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఇంకెంత కాలం మోదీ పదే పదే ఎమర్జెన్సీ గురించి మాట్లాడి పబ్బం గడుపుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికే వంద సార్లు ఎమర్జెన్సీ గురించి మాట్లాడారని అన్నారు.



### మంత్రి దామోదరతో

## జూడాల చర్చలు

అసంపూర్తిగా ముగింపు...
సమ్మె కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం): తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జూనియర్ డాక్టర్లు జూడాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహంతో జూడాలు చర్చలు జరిపారు. అయితే, ఈ చర్చలు అసంపూర్తిగా ముగిశాయని జూడాలు వెల్లడించారు. కొన్ని అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, మరికొన్ని అంశాలపై మరోసారి చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా అంశాలపై ప్రతిపాదనలను మంత్రి ఉన్నతాధికారులకు పంపించినట్లు జూడాలు తెలిపారు. వైద్యుల భద్రత గురించి మంత్రి ఆలోచిస్తామన్నారని, స్టైఫండ్‌కు గ్రీన్‌ఛానల్‌పై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు జూడాలు తెలిపారు. సమ్మె కొనసాగింపుపై రాష్ట్రస్థాయి జూడాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని,

..మిగతా 2లో

## రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో
# సీఎం రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారిం చేందుకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. రాష్ట్రంలో స్కై వేల నిర్మాణం, రక్షణ శాఖ భూముల బదలాయింపులపై రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ చర్చించారు.వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ తో పాటుగా కొత్తగా ఎన్నికైన లోక్ సభ ఎంపీలు మల్లు రవి, రఘురామిరెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.





## విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను సిద్ధం చేయండి

మొదటి పేజీ తరువాయి...

సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాల్గో యూనిట్ పునరుద్ధరణకు కావాల్సిన రూ.2కోట్ల అంచనా వ్యయాన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2006లో రికార్డు స్థాయిలో 26వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసిన విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలల ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, తుడి మేఘారెడ్డితోపాటు సంస్థ సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ ఆదినారాయణ పాల్గొని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.



## లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

న్యూఢిల్లీ, జూన్ 24(ప్రభాత ఉదయం): 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. కార్యక్రమాలను ప్రారంభించారు. సభ్యులు రాజ్యాంగం మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికలన సభ్యుల జాబితాను లోక్‌సభ సెక్రటరీ సభ ముందుంచారు. అలాగే రాహుల్ గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు భర్తృహరితో రాష్ట్రపతిభవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి ముర్ము ప్రమాణం చేయించారు. లోక్‌సభాపక్ష నేతగా ప్రధాని మోదీ తొలుత ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే ఎన్డీయే కూటమి సభ్యులంతా మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నామినేటెడ్ ప్యానల్ స్పీకర్లు ప్రమాణం చేశారు. అయితే విపక్ష ఎంపిలు కొందరు ఇందుకు ముందుకు రాలేదు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయించారు. మంత్రుల్లో తొలుత రాజ్‌నాథ్ సింగ్ తరవాత అమిత్ షా, గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు వరుసగా ప్రమాణం చేశారు. తొలిరోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో మంగళవారం ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించ నున్నారు. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు సముదాయంలోని పాత భవనం వద్ద కలుసుకుని, అక్కడి నుంచి నూతన భవనం వరకు ర్యాలీగా వచ్చారు. మొన్నటివరకు మహాత్మాగాంధీ విగ్రహం ఉన్న ప్రాంతంలో రాజ్యాంగం చిరు ప్రతులను చేతపట్టుకుని కొంతసేపు నిరసన చేపట్టారు. అనంతరం వీరంతా ఒకేసారి లోక్‌సభకు వెళ్లారు. సభ ప్రారంభం కాగానే కేరళలోని వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను స్పీకర్ ఆమోదించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ రాహుల్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరం వయనాడ్‌ను వదులకుని రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నారు.

## అలకబూనిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నారు. మరోవైపు ఆయన్ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని వారు కోరినట్లు సమాచారం. 40 ఏళ్లు గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని.. పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్టీ అధినాయకత్వంపై అలకబూనినట్లు సమాచారం. ఈ క్రమంలో తన అనుచరుల ఫోన్ ఎత్తకుండా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే జీవన్ రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేస్తున్నాయి. జీవన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ వార్తలపై జీవన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. సంజయ్ చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, సంజయ్ చేరికపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నారు. దీంతో సోమవారం ఉదయం నుంచే జీవన్‌రెడ్డి ఇంటికి పార్టీ నాయకులు భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. అయితే ఈ విషయమై పార్టీ అధిష్ఠానం ఆయనతో మాట్లాడుతున్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపులపై జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే తన నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నదని, ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదని తెలిపారు. ఇలాంటి వాటిని తాను వ్యక్తిగతంగా ప్రోత్సహించనని స్పష్టంచేశారు. అయితే ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో జగిత్యాల రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించారు.



## తెలంగాణలో భారీగా
# ఐఏఎస్‌ల బదిలీ

### జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి నియామకం
### విద్యుత్ శాఖ కమిషనర్‌గా రొనాల్డ్ రోస్

హైదరాబాద్, జూన్ 24(ప్రభాత ఉదయం): తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. 44 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది.చేనేత, హస్తకళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించడంతో పాటు.. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ సుల్తానియాను నియమించారు. ఆయనకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించడంతో పాటు టీపీటీఆర్ఐ డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన రొనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇక పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేనను కళాశాల, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్, అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమించారు. ఆయనకు టీపీటీఆర్ఐ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా ఉన్న రిజ్వీని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. జీఏడీ ముఖ్యకార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డిని నియమించారు. దాసరి హరిచందనను రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.



## మంత్రి దామోదరతో జూడాల చర్చలు

మొదటి పేజీ తరువాయి...

అప్పటి వరకు సమ్మె యథాతథంగా కొనసాగిస్తామని చెప్పారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైపెండ్ చెల్లింపు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు రూ.1.25 లక్షల గౌరవ వేతనం, వైద్యకళాశాలలో పెంచిన 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో జూడాలు సమ్మె చేస్తున్నారు.ఈ సమావేశంలో జూడాలు పలు డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మరి కొన్ని అంశాలపై మరోమారు చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆయా అంశాలపై ప్రపోజల్స్ ఉన్నతాధికారులకు పంపిచినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి సమ్మె యథాతథంగా కొనసాగిస్తామని జూడాలు తెలిపారు.

## లోక్‌సభ నేటికి వాయిదా

### స్పీకర్ పదవికి రాజీనామా చేసిన ఓం బిర్లా



న్యూఢిల్లీ, జూన్ 24(ప్రభాత ఉదయం): లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. 18వ లోక్ సభకు కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణం చేస్తుండగానే ఇండియా బ్లాక్ నాయకులు నిరసనకు దిగారు. బిజెపి నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజ్యాంగం ప్రతులను చేతబూని మరి నిరసన చేపట్టారు. నిరసనకు దిగిన నాయకులలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నాయకురాలు సోనియా గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ తదితరులున్నారు. ఇదిలావుండగా, ప్రధాని నరేంద్ర మోడీ18వ లోక్ సభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణస్వీకారం చేయించారు. దీనికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బిజెపి ఎంపీ భర్తృహరి మహతాబ్ తో ప్రొటెం స్పీకర్ గా ప్రమాణస్వీకారం చేయించారు. కాగా ఎనిమిది సార్లు కాంగ్రెస్ ఎంపీగా ఎన్నికైన కె. సురేశ్ ను కాదని మెహతాబ్ ను ప్రొటెం స్పీకర్ గా ఎంచుకోవడంపై కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇకపోతే జూన్ 26న లోక్ సభ కొత్త స్పీకర్ ను ఎన్నుకోవడం జరుగుతుంది. అప్పటి వరకు ప్రొటెమ్ స్పీకరే కార్యకలాపాలను కొనసాగించనున్నారు. 18వ లోక్ సభలో ఇండియా బ్లాక్ కు 234 సీట్లు, ఎన్ డిఏ కూటమికి 293 సీట్లు ఉన్నాయి. ఇకపోతే గత సభలో స్పీకర్‌గా ఉన్న ఓంబిర్లా రాజీనామా చేశారు.

## హెయిర్ సెలూన్‌ను ధ్వంసం చేసిన మందు బాబులు



దానమ్మ జోపిడీ ఒవైసీ హిల్స్ లో హెయిర్ సెలూన్‌లో అద్దాలను ధ్వంసం చేసిని మందుబాబులు

బుద్వేల్, జూన్24(ప్రభాత ఉదయం) : బీహార్ నుంచి బ్రతకడానికి వచ్చిన మీరు మేము చెప్పినట్లు చేయరా .. అంటూ ముగ్గురు మందుబాబులు ఓ హెయిర్ సెలూన్ నిర్వాహకునిపై దాడి చేయడమే కాకుండ సెలూన్ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి దానమ్మ జోపిడి , ఓవైసీ హిల్స్ ఇడ్లీ హోటల్ సమీపంలో జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దానమ్మ జోపిడి ఓవైసీ హిల్స్ ప్రాంతంలో బీహార్ కు చెందిన శౌకిన్ కు హెయిర్ సెలూన్ ఉంది. అక్కడికి ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఓవైసీ హిల్స్ కు చెందిన సర్వర్, అయాన్. నదీమ్ లు మద్యం సేవించి వచ్చి తమకు మసాజ్ చేయాలని డిమాండ్ చేశారు. తాగి ఉన్నారు కదా అని ఒకరికి మసాజ్ చేసిన శౌకిన్ ను మిగతా ఇద్దరు కూడా మసాజ్ చేయాలని అడిగాడు. దానికి ఆయన నిరాకరించడంతో అతనిపై అక్కడ పనిచేస్తున్న వారిపై పిడుగుద్దుల వర్షం కురిపించి , హెయిర్ సెలూన్ లోని అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో శౌకిన్ మైలార్ దేవ్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికంగా ఉన్న మహిళలు కూడా అయాన్, నదీమ్, సర్వర్ ల గురించి పోలీసులకు వివరించారు.

### ముగ్గురు పై కేసు నమోదు చేశాం : ఇన్స్ పెక్టర్ పి మధు

ఆదివారం రాత్రి హెయిర్ సెలూన్ పై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశామని మైలార్ దేవ్ పల్లి పల్లి ఇన్స్ పెక్టర్ పి మధు తెలిపారు.



గొడవ గురించి విస్తరిస్తున్న స్థానిక మహిళలు

# జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జీఎంగా ఎన్ సాయిలక్ష్మి



రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. సాయి లక్ష్మీ



జీ ఎం సాయి లక్ష్మీ కు అభినందనలు



సిబ్బంది ఆధ్వర్యంలో...

రాజేంద్రనగర్, జూన్ 24(ప్రభాత ఉదయం): జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్ గా ఎన్ సాయి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ జిఎమ్ గా పనిచేసిన శ్యాంసుందర్ సైదాబాద్ డివిజన్ జియంగా బదిలీ అయ్యారు. సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించిన జిఎం సాయి లక్ష్మి కి డిప్యూటీ జనరల్ మేనేజర్ జమీల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్లు నరసింహారెడ్డి, ఖాదర్, శ్రావ్య రెడ్డి, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం సాయిలక్ష్మీ మాట్లాడుతూ... స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరా లో మెరుగైన సేవలు అందించటానికి కృషి చేస్తామన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## నియోజకవర్గ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట, జూన్ 24(ప్రభాత ఉదయం) నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. సోమవారం కొత్తకోట సమీపంలోని బీమా ఫేజ్ - 2 పంప్ హౌజ్ వద్ద ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ, కొత్తకోట మున్సిపల్ అధికారులతో వివిధ అభివృద్ధి, సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... ఆయా మండలాల్లో చాలా కాలంలో పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించి, పనులు వేగవంతంగా సాగేలా కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో అధికారులు స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని తమ, తమ స్థాయిలో పరిష్కరించాలని, పరిష్కారం కానివి ఏవైనా ప్రతిపాదనలు తీసుకొస్తే సంబంధిత మంత్రి తో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

## ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్

### ఏబీవీపీ బందుకు సహకరించాలి... కూకట్ పల్లి జిల్లా కన్వీనర్ ప్రతీక్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 24 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్న ఇంతవరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ సిగ్గుచేటు అని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రతీక్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య వ్యవస్థను విధ్వంసం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలలు శిథిల అవస్థకు గురి అయిన పట్టించుకోని పరిస్థితి నెలకొంది అని అన్నారు. దీనిని అదునుగా చేసుకున్న ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి లక్షలు ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయి. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిద్రమబ్బు నుంచి మేల్కొని విద్యా వ్యవస్థను పట్టించుకోని విద్యార్థులను పట్టించుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందిని అన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జూన్ 26న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలకు ఏబీవీపీ బందుకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్లను సూచించారు.

1. ప్రభుత్వ గుర్తింపు మరియు నిబంధనలను పాటించినటువంటి పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోవాలి.
2. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలి.
3. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
4. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి.
5. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో మరియు ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
6. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో జరుగుతున్న అవకతవకలపై వెంటనే విచారణ జరిపి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి.

## పాత కక్షలతో కత్తులతో ఓ యువకుడి పై దాడి



బుద్వేల్, జూన్24(ప్రభాత ఉదయం) : పాత కక్షులతో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్ బాబా నగర్ లో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం ప్రకారం...... జలాల్ బాబా నగర్ కు చెందిన జిలానీ, షహబాజ్ లు స్నేహితులు . వీరికి పాత కక్షలు ఉన్నాయి ఆదివారం ఇద్దరు మద్యం సేవించారు . అనంతరం శహబాజ్ పై జిలానీ కత్తితో దాడి చేశాడు . శహబాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చేతి బ్యాగ్‌లోంచి ఎనిమిది తులాల బంగారం మాయం

బుద్వేల్, జూన్24(ప్రభాత ఉదయం):శుభకార్యానికని అమ్మ గారి ఇంటికి వచ్చిన ఓ మహిళ షాపింగ్ కి వెళ్లి 8 తులాల బంగారం , పదివేల రూపాయల నగదును పోగొట్టుకుంది. ఈ సంఘటన శనివారం హసన్ నగర్ లో జరిగింది. ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి కథనం ప్రకారం..... కర్ణాటక రాష్ట్రం బసవ కళ్యాణ్ ప్రాంతానికి చెందిన ఫర్వీనా బేగం తన పుట్టింటి వద్ద శుభకార్యం ఉండగా నాలుగు రోజుల క్రితం హసన్ నగర్ కు వచ్చింది. శనివారం తిరిగి బసవ కళ్యాణ్ వెళ్లడానికి ముందు హసన్ నగర్ లో షాపింగ్ కు వెళ్ళింది. అదే రోజు హసన్ నగర్ లో కూరగాయల వాదంతపు సంత కూడా ఉంటుంది . షాపింగ్ చేస్తున్న ఫర్వీనా బేగం హ్యాండ్ బ్యాగ్ లో ఉంచిన ఎనిమిది తులాల బంగారం , 15000 నగదు కనిపించకుండా పోయాయి . దీంతో ఆమె అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది . కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## బుద్వేల్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామీ వారిని దర్శించున్న యతిపతి శ్రీధర్

బుద్వేల్ లోని శ్రీ శివ పోతులూరు వీరబ్రహ్మం గారి మఠము వారు 22 వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ పాల్గొన్నారు.



ఆనంద్ గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న డి. సత్యనారాయణ ముదిరాజ్

## బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డి. సత్యనారాయణ ముదిరాజ్

బుద్వేల్, జూన్24(ప్రభాత ఉదయం): బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రనగర్ సర్కిల్ గాంధీనగర్ కు చెందిన డి సత్యనారాయణ ముదిరాజ్ మూడవసారి నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. మనకు పదవి రావడానికి కారకులైన ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ , రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోక్క నర్సింహా రెడ్డి కి రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు పార్టీ సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. .నాపై నమ్మకము తో మూడవ సారి నియమించిన సందర్భంగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేస్తున్నానన్నారు.




మిరాసిపల్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## ఒకేసారి రైతుల రెండు లక్షల రుణమాఫీ: ఎమ్మెల్యే జీఎంఆర్

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగాలి గ్రామస్థాయి నాయకులు ప్రజలకు మరింత చేరువ కావాలి

కొత్తకోట, జూన్24(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని త్వరలో ఒకేసారి అమలు చేస్తుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామంలో విస్తృతంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మిరాస్ పల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్లేసి మెజార్టీ ఇచ్చిన మిరాస్ పల్లి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించి గ్రామంలో దర్గా ను దర్శించుకుని, గ్రామంలోని పలు కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు పరిశీలించారు. ఎస్సీ కాలనీ లోని పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాలనీ లోని విద్యుత్ సమస్య గురించి తెలుసుకుని సమస్య పరిష్కారించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల జితేంద్రనాథ్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కళాశాల అధ్యాపకులతో విద్యా సమస్యలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## ప్రభుత్వ విద్యాసంస్థలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, జూన్24(ప్రభాత ఉదయం) ప్రభుత్వం విద్యాసంస్థలకు వర్తిస్తాయి మౌలిక సదుపాయాలు కల్పించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తెలిపారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధ్యాపక బృందంతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తి అయ్యే వరకు, ప్రస్తుత విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాల తరగతులను ఇంటర్మీడియట్ కాలేజ్ భవనంలో నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి డిగ్రీ కళాశాల దేవరకద్ర నియోజకవర్గానికి కేటాయించడం సంతోషకరమని అన్నారు, ఈ విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కళాశాల ప్రక్రియ మొదలైందని, ఈ ఏడాది బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, ఎంపీసీ ఎంపీసీఎస్ లో 60 సీట్లు, డీఎస్సీ లైఫ్ సైన్స్ బి జెడ్ సి కోర్సులలో 60 సీట్లు, బి ఏ హెచ్ ఇ పి లో60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం సీఏ లో 60 సీట్లు మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 28వ తేదీ నుండి దోస్త్ యాప్ లో వెబ్ ఆప్షన్ లో నమోదు చేసుకుని, డిగ్రీ కాలేజీ లో అడ్మిషన్లు పొందాలని విద్యార్థులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి , డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మల్లెబారి సాహెబ్ దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## మల్లెబారి సాహెబ్ ఉర్సే షరీఫ్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, జూన్24(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మల్లెబారి సాహెబ్ ఉర్సే షరీఫ్ 116 గంధం మహోత్సవం లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న

# ఇద్దరు నిందితుల రిమాండ్




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య



నారాయణపేట, జూన్24(ప్రభాత ఉదయం) జల్సాలకు అలవాటు పడి ఇండ్లకు తాళాలు వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించడం జరుగుతుందని డిఎస్పి ఎన్ లింగయ్య తెలిపారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పి లింగయ్య ఏం మాట్లాడుతూ... మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్కురు గ్రామంలో రెండు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడిన వారి వివరాలను డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఈనెల 20వ తేదీన అర్ధరాత్రి వర్కుర్ గ్రామం లో తాళం వున్న ఇంటికి తాళాలు పగులగొట్టి బంగారు నగలు వెండి వస్తువులను దొంగతనం చేయగా వర్కుర్ గ్రామానికి చెందిన ఇంటి యజమాని బొజ్జ మొల్ల సుజాత పిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు 21 తేదీ మగానూర్ పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 24 తేదీ ఉదయం 07:00 గంటలకు మాగ నూర్ పోలీస్ లు విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమనితులైన వ్యక్తులను పట్టుకొని విచారించగా వారిలో ఒక వ్యక్తి వర్కూర్ గ్రామానికి చెందిన లక్ష్మప్ప కుమారుడు ఊరుముందర నరేశ్ ఏ కార్తీక్ (24) , అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొనడ మండలం పి కోట కొండ గ్రామానికి చెందిన స్వర్గీయ ఉరుకుంద కుమారుడు బోయ వీరేంద్ర లు ఇద్దరు గత 3 నెలలు గా పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడ్డారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉదేశ్యంతో, ఇద్దరు కలిసి వార్కూర్ గ్రామానికి వచ్చినారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇండ్లను అదునుగా చూసి వర్కూర్ గ్రామంలోని నరేష్ ఇంటి వెనకాల వున్న రెండు ఇండ్లలో తాళం వేసి ఉన్నాయి అని చూసి ఈనెల 20 తేదీ అర్ధరాత్రి ఇద్దరు కలిసి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో సుమారు 6 తులాల బంగారం ఆభరణాలు (మూడు లక్షలు) ,1.5 తులల వెండి , 200 చిల్లర పైసలు మ, ఒక మొబైలు ఫోన్ దొంగతనం చేశారు. ఈ రోజు(సోమవారం) మాగనూరు పోలీస్ లు అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుండి 5.5 తులాల బంగారూ ఆభరణాలు (నేకలెస్స్,లాంగ్ చైన్,కమ్మలు చిన్న ఉంగరం ) , 1.5 వెండి వస్తువులు , ఒక సాంసంగ్ మొబైలు ఫోన్ , 8560/- రూయలు వారి నుండి స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి నారాయణపేట కోర్టు ముందు హాజరు పరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని జైల్ కు పంపించామని డి.ఎస్.పి ఎన్ లింగయ్య తెలిపారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించినందున మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్సై అబ్దుల్ ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవీందర్ సాయికుమార్, రాజశేఖర్ లను డీఎస్పీ లింగయ్య అభినందించి వారికి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు సమస్యను వివరిస్తున్న మహిళ

## ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరిస్తాం

### అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

### ప్రజావాణిలో 45 మంది తమ సమస్యలపై వినతి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(ప్రభాత ఉదయం) ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మునిని వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 45 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని అయన తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే జాప్యం లేకుండా జిల్లా అధికారులు పరిష్కరించాలని అయన అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 45 దరఖాస్తులలో 2 ఆసరా పెన్షన్లు, 3 ధరణి సమస్యలతో పాటు ఇతర శాఖలకు సంబంధించినవి 40 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రాంచందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శే రి లింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ జన్మదిన సందర్భంగా విశ్వగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ఘనంగా జగదీశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు

### మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎడ్ల సంపత్ రెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 24 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీష్ గౌడ్ జన్మదిన వేడుకలు నల్లగండ్ల లోని వారి నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల సంపత్ రెడ్డి, సునీల్ కలిసి పూల బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని, మున్ముందు మరెన్నో ఉన్నతపదవులను పొందాలని అకాంక్షించారు.



సీఎం రేవంత్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 24 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క ని వారి నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇలానే అందుబాటులో ఉంటూ, ఆరోగ్యకరమైన జీవితంతో నీ ప్రతి అడుగు ప్రజలకు మంచి జరిగేలా, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని జగదీశ్వర్ గౌడ్ కి సూచించారు.



నీట్ పై జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(ప్రభాత ఉదయం)మే 5న నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్-యూజీ నిర్వహణలో అవకతవకలు జరిగాయని, సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ , విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం గద్వాల పట్టణం వైఎస్ ఆర్ చౌక్ లో విద్యార్థి సంఘం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నీట్ అవకతవకలను సిబిఐ తో కాకుండా సుప్రీం కోర్టు జుడీషియల్ కమిటీ తో విచారణ జరిపించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోడీ తీసుకవచ్చిన నూతన జాతీయ విద్యా విధానం లోపా భూయిష్టంగా ఉందని నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాలకు ఈ విద్యా విధానమే కారణం అని ఆరోపించారు. నీట్ అక్రమాల వల్ల 24 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, నీట్ పరీక్షను రద్దు చేసి గతంలో మాదిరిగా వీటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

## ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 24 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం సోమవారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో బోయినపల్లికి చెందిన శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. మెడికల్ హెల్త్ క్యాంప్ ను కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్ లోని ప్రతివారం బస్తీలలో వారం నుండి పది రోజులకు ఒకసారి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన బిపి, షుగర్ థైరాయిడ్, కంటి వివిధ రకాల వంటి సమస్యలను పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైతే చికిత్స కూడా చేపించే ఏర్పాట్లు చేయించడం జరుగుతుందని, కాబట్టి ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర హాస్పిటల్ ప్రతినిధి సునీల్, శశి, బాగయ్య, సురేందర్ నాయుడు, సలావుద్దీన్, బాలమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్...
### రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: షేరి సతీష్ రెడ్డి...
### సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం...
### కూకట్ పల్లి రైతు బజార్లో వర్షం వ్యక్తం చేసిన రైతులు...

కూకట్‌పల్లి, జూన్ 24 (ప్రభాత ఉదయం) అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని మేనిఫెస్టోలో పెట్టిన నేపథ్యంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం మంత్రివర్గ ఏర్పాటుచేసిన సమావేశంలో ఏకగ్రీవంగా రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని తీర్మానం చేశారు. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి రైతు బజార్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అన్నారు. ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేయించడం ఇది చరిత్రలో సురిస్థిరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తినా ఆదుకునే ప్రభుత్వమని ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అయినప్పటికీ కేసిఆర్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ నేతలు తరచూ విమర్శలు చేస్తూ ప్రజలకు దూరమవుతున్నారని, ఇక ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసలైన నిరుపేదల కోసం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసే కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రజలు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్ర మంలో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, గాలి బాలాజీ, అరవింద్ రెడ్డి, అప్పారావు, బాకీ, శివ చౌదరి, సంజీవ, రాజేందర్, రజిత, రేష్మ, జోజమ్మ, బండి సుధ తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న ఇబ్రహీం బాగ్ విద్యుత్ డి ఈ శివశంకర్, ఏఈ జ్ఞానేశ్వర్ లు

## ప్రజలకు మెరుగైన సేవలు

### డిఈ శివశంకర్

### విద్యుత్ ప్రతి సమాచారం ఇక డిజిటలైజేషన్

గండిపేట, జూన్ 24(ప్రభాత ఉదయం) విద్యుత్ సరఫరా మెరుగుపరిచి ప్రజలకు మరింత అత్యాధునిక సమాచారం అందించేందుకు ప్రతి విద్యుత్ స్తంభం సమాచారం డిజిటలైజేషన్ చేస్తున్నామని ఇబ్రహీం భాగ్ విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ ఎం శివశంకర్ తెలిపారు. సోమవారం టి జి ఎస్ పి డి సి ఎల్ సి ఎం డి ముషారఫ్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ వ్యవస్థను ఆధునికరించి ప్రతి సమాచారం డిజిటలైజేషన్ చేయాలని సంకల్పంతో ముందుకు వెళ్ళటానికి ప్రతి విద్యుత్ సమాచారం కంప్యూటరీకరుణ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డి శివశంకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తుందని ఈ వ్యవస్థను మరింత ఆధునిక సమాచారంతో సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునికరించడానికి క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు మరింత చేరువతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డి ఇ శివ శంకర్ తోపాటు అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, సబ్ ఇంజనీర్ చెన్నారెడ్డి, ఇన్స్పెక్టర్లు, లైన్ మా న్లు, పాల్గొన్నారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.